క్లుప్తంగా

కోదండరాముడికి రేపటి నుంచి విశేష పూజలు

సీతారామపురం: మండలంలోని గుండుపల్లిలో కొలువుదీరిన సీతాసమేత ప్రసన్న కోదండరామస్వామి దేవస్థానం 11వ వార్షిక మహోత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ బుధవారం తెలిపింది. 17వ తేదీ ఉదయం గణపతి పూజ, అభిషేకాలు, ప్రత్యేక హోమాలు, రాత్రికి కోలాటం, 18వ తేదీ ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం, రాత్రికి భజన కార్యక్రమం, గ్రామోత్సవం, 19వ తేదీ పోలేరమ్మ తల్లికి సలిపిండి, పానకాలు, చద్ది, పొంగళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి అన్నదానం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోదండరామస్వామి దేవస్థాన వార్షిక మహోత్సవాలు జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

నేడు అడల్ట్ బీజీసీ వ్యాక్సినేషన్ ప్రారంభం

సీతారామపురం: మండలంలోని 9 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గురువారం అడల్ట్ బీజీసీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మండల వైద్యాధికారిణి ఏ స్వప్నారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవై ఏళ్లు పైబడిన, పొగ తాగే అలవాటు ఉన్న వారికి, షుగరు వ్యాధిగ్రస్తులకు, గత ఐదేళ్ల టీబీ ట్రీట్‌మెంట్ తీసుకున్న వారికి, మూడేళ్ల నుంచి వారితో కలిసి ఉన్న కుటుంబ సభ్యులకు, బాడీ మాస్క్ ఇండెక్స్ 18కి కంటే తక్కువ ఉన్న వారికి బీసీజీ టీకాలు ఇవ్వబడతాయన్నారు. సమాజంలో టీబీ వ్యాధిని నియంత్రించడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫ్యాన్‌కు పల్లెలు ఫ్యాన్స్

చేజర్ల: రెండు దశాబ్దాలకు పైగా టీడీపీకి మెజార్టీ వస్తున్న చేజర్ల మండలంలో తొలిసారిగా ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారనే విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం కుల, మత, రాజకీయ పార్టీలను చూడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి అందించారు. మండలంలో 27,887 ఓట్లు ఉన్నప్పటికి అందులో 24,672 ఓట్లు పోలయ్యాయి. వీటిలో సుమారు సగానికి పైగా వైఎస్సార్‌సీపీకి ఓట్లు పడినట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా వేశారు. అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, నేతన్న నేస్తం, రుణమాఫీ, కాపు నేస్తం, నాడు–నేడు రైతు భరోసా వంటి పలు పథకాలతో ప్రతి ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి పొందడంతో ప్రజలు టీడీపీని వ్యతిరేకించి వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేశారు. మండలంలోని యనమదల, మడపల్లి, కోటితీర్థం, బోడిపాడు, ఏటూరు, నెర్నూరు, ఆదూరుపల్లి, ఉలవపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో అత్యధిక మంది ఓటర్లు ఫ్యాన్ గుర్తుకు మద్దతు తెలిపారు.

గిరిజన కాలనీలో తాగునీటి ఎద్దడి

సీతారామపురం: మండలంలోని బోడసిద్ధాయపల్లి గిరిజన కాలనీలో గత ఇరవై రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. సుమారు 300 మంది జనాభా ఉన్న ఆ కాలనీలో మినీ వాటర్ స్కీం పథకం మరమ్మతులకు గురికావడం, చేతి పంపులోని నీరు ఇంకిపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. గిరిజనులు దాహార్తి తీర్చుకునేందుకు గ్రామానికి సుదూరంగా ఉన్న రైతుల పొలాల్లోని పంపుసెట్లు ఆశ్రయిస్తున్నారు. కొందరు రైతులు నీరు ఇస్తుంటే మరికొందరు తమ పొలాల్లోకి రావద్దని ఆంక్షలు విధిస్తుండడంతో గిరిజనుల అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. గత ఇరవై రోజులుగా తమ గొంతు ఎండుతోందని, పంచాయతీ పాలకులు, అధికారులకు తాగునీటి సమస్యపై పలుమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం శూన్యమని కాలనీవాసులు వాపోతున్నారు. కనీసం ప్రత్యామ్నాయ మార్గాలు సైతం కల్పించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

ఆర్‌ఎంపీ లక్ష్మీనారాయణ రావు మృతి



డాక్టర్ లక్ష్మీనారాయణ (ఫైల్)

ఉదయగిరి: ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ ధన్వంతరి ఆరోగ్య పీఠం అధ్యక్షుడు వీఎల్ నారాయణరావు గుండెపోటుతో బుధవారం చిత్తూరు జిల్లా కలికిరిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలందిస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన వైద్యుడు కాక ముందు యాక్టర్‌గా కూడా పలు సినిమాల్లో నటించారు. ఆయన తండ్రి శ్రీరాములు ఆయుర్వేద డాక్టర్‌గా గండిపాళెంలో వైద్య సేవలందించారు. నారాయణరావు అంత్యక్రియలు గురువారం బుచ్చిరెడ్డిపాళెంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పల్లెల్లో 'గాలి' వీచింది

పల్లెల్లో 'గాలి' ప్రళయంగా వీచిందా? అంటే అవుననే అంటున్న రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. పోలింగ్ ముగిసింది. తన తీర్పును ఈవీఎంలో ఓటరు ఇచ్చేశారు. జూన్ 4న లెక్కింపులో వాస్తవ ఫలితం తేటతెల్లం కానుంది. అయితే పోలింగ్ జరిగిన తీరుపై ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఓటర్లు పనులకు వెళ్లిన చోట్ల ఆసక్తికర చర్చలు జరుగుతున్నాయి.

- భారీగా పెరిగిన గ్రామీణ పోలింగ్
- పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, రైతులు బారులు తీరి ఓటింగ్
- ఎన్నికల తీరుపై గ్రామాల్లో చర్చ



పల్లెల్లో పోటెత్తిన ఓటరు (ఫైల్)

ఉదగయగిరి: ఉదయగిరి గ్రామీణ ఓటర్లతో కూడిన నియోజకవర్గం. 90 శాతం కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు పొందినవారే. ఈ ఐదేళ్లలో ఏ ప్రభుత్వంలో పొందని లబ్ధి డీబీటీ, నాన్ టీబీటీ ద్వారా ప్రభుత్వం సహాయం చేసింది. ముఖ్యంగా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుపడ్డాయి. పల్లెల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు చేరాయి. ప్రతి పల్లెల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు, సచివాలయ భవనాలు, ఆధునిక సౌకర్యాలతో పాఠశాలల్లో మారిన రూపు రేఖలు, ఇలా ఎంతో వ్యత్యాసం గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వానికి మధ్య తేడా గమనించారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని మరో సారి ఆశీర్వదించారని పల్లె ఓటర్లు మనోగతం ద్వారా తెలుస్తోంది. పేద వర్గాలు, మహిళలు, రైతులు, రైతు కూలీలు వివిధ పనుల సందర్భంగా తాము 'ఫ్యాన్' ఓటు వేసినట్లు స్పష్టంగా చెబుతున్నారు. వింజమూరు మండలం ఊటుకూరులో ఉపాధి పనులు చేస్తున్న మహిళలు పోలింగ్ గురించి చర్చించుకుంటూ మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తోందని నమ్మకంగా విశ్వసిస్తూ తాము 'ఫ్యాన్' కే ఓటు వేసినట్లు చెబుతున్నారు. ఉదయగిరి మండలం దాసరి పల్లిలో వ్యవసాయ పనుల్లో పోలింగ్‌పై చర్చించుంటూ తాము ఫ్యాన్‌కు ఓటు వేశామని జగన్ సీఎం అవుతారని మాట్లాడుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గ మొత్తం ఓటర్లలో 60 శాతం పైగా ఉన్న మహిళ ఓటర్లు ఎక్కువగా ఫ్యాన్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. వీరు తీర్పు కీలకం కానుంది. పోల్ అయిన ఓట్లలో వైఎస్సార్‌సీపీ 55–65 శాతం పైగా ఓట్లు పడినట్లు చర్చ జరుగుతోంది. వీరు ఏ పార్టీకి ఓటు వేసి ఉంటే ఆ పార్టీ విజయం సాధించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పోలింగ్ జరుగుతున్న సరళిని గమనించినా... పోలింగ్ తర్వాత ఓటరు మనోగతం గమనించినా.. ఫ్యాన్ వైపు ఓటరు మొగ్గు చూపినట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఉదయగిరిలో తమ్ముళ్ల ఆశలు గల్లంతైనట్లు ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.

కలిగిరిలో 83.34 శాతం పోలింగ్

కలిగిరి: సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో 83.34 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 37,963 మంది ఓటర్లకు 31,637 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో అత్యధికంగా తూర్పుగుడ్లదొన పోలింగ్ కేంద్రంలో 92.14 శాతం పోలింగ్ నమోదు కాగా, పడమరగుడ్లదినలో 91.59, పెద్దఅన్నలూరులో 91.43, తూర్పుమాలపాళెంలో 90.36 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ భారీగా జరగడంతో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని రాజకీయ చర్చలు విస్తృతంగా సాగుతున్నాయి. ఎక్కడా కూడా టీడీపీ గెలుస్తుందనే చర్చ వినిపించడం లేదు. ఏ మండలంలో ఎంత, ఏ బూత్‌లో ఎంత మెజార్టీ వస్తుందని గ్రామాల్లో ఎడతెరపని చర్చలు జరుగుతున్నాయి.

వరికుంటపాడులో 85.54 శాతం..

వరికుంటపాడు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మండలంలోని 24 పంచాయతీల్లోని 39 పోలింగ్ కేంద్రాల్లో 85.54 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని జలదంకి మండలంలో 37,814 మంది ఓటర్లకు 32,503 మంది (85.95 శాతం) ఓటు హక్కు వినియోగించుకుని మొదటి స్థానంలో నిలిస్తే.. వరికుంటపాడులో 25,925 మంది ఓటర్లకు 22,177 (85.54 శాతం)మంది ఓటు హక్కు వినియోగించుకుని రెండో స్థానంలో నిలిచింది. మండలంలో పురుషులు 12,822 మంది, మహిళలు 13,101 మంది ఇతరులు ఇద్దరు ఉండగా, వారిలో పురుషులు 11,146, మహిళలు 11,029 మంది ఇతరులు ఇద్దరు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో గెలుపోటములపై గ్రామాల్లో చర్చలతో పాటు పందేలు కూడా కాస్తున్నారు. వలస ఓటర్లు అధికంగా గ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కువ శాతం పోలింగ్ నమోదు కావడంతో విజయావకాశాలు ఎవరిని వరిస్తాయోనని చర్చించుకుంటున్నారు.

సీతారామపురం 76.80 శాతం పోలింగ్

సీతారామపురం: సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో 76.80 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 14 పంచాయతీల్లో 19,160 మంది ఓటర్లుండగా వారిలో 14,715 మంది వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో 7,232 మంది పురుషులు, 7,483 మంది మహిళలున్నారు. ఈ దఫా ఎన్నికల సరళిని పరిశీలిస్తే మహిళలు, యువత, వృద్ధులు అధికంగా పాల్గొనడంతో అది వైఎస్సార్‌సీపీకి అనుకూలమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పల్లెవాసులు పూర్తిగా వైఎస్ జగన్ ప్రభుత్వానికే మద్దతు తెలుపుతూ ఓటింగ్ చేశారని తెలుస్తోంది.

నియోజకవర్గంలో పోలింగ్

మొత్తం ఓటర్లు	2,41,677
పురుషులు	1,19,929
మహిళలు	1,21,738
ఇతరులు	10
పోలైన ఓట్లు	1,97,970
పురుషులు	99,413
మహిళలు	98,554
ఇతరులు	03

పల్లెల్లో ఎన్నికల ఫలితాలపై పందేలు

సీతారామపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు మండలాల వారీగా కూడికలు, తీసి వేతల పనిలో నిమగ్నమయ్యారు. ఓటమి తప్పదని తెలిసినప్పటికీ టీడీపీ నాయకులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు బెట్టింగ్‌లు వేస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఉదయగిరిలో రాజగోపాల్‌రెడ్డి విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు బెట్టింగ్‌లు వేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు 19 రోజుల సమయం ఉండడంతో బెట్టింగులు మరింత జోరందుకునే అవకాశముంది. ఉదయగిరి నియోజకవర్గంలో 83.64 శాతం పోలింగ్ జరగడంతో ఇరు పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మా నాయకుడిదే గెలుపంటే.. మా నాయకుడిదే విజయం అంటూ బహిరంగంగానే పందెం కాస్తూ బాండ్ పేపరు రాసిస్తావా.. అంటూ సవాళ్లు విసురుతున్నారు.

వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లెలో బుధవారం సీతారాముల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయ అర్చకులు స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహ వచనం, నవగ్రహ మండపారాధన, కలశస్థాపన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గ్రామంతో పాటు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

తీవ్ర నైరాశ్యంలో టీడీపీ

- పోటెత్తిన మహిళల ఓట్లు
- వైఎస్సార్‌సీపీకేనని పలువురు విశ్లేషణ
- ఊహించని స్థాయిలో ఓట్లు పడలేదని మదనంలో టీడీపీ క్యాడర్
- ప్రభావం చూపలేని ప్యాకేజీల లీడర్లు

ఆత్మకూరు: సార్వత్రిక పోలింగ్ సరళిపై టీడీపీ 'పోల్'మార్టం ప్రారంభించింది. ఎన్నికల తర్వాత ఊరూవాడా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తోందనే చర్చలు జరుగుతున్నాయి. అధికార ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదు.. ప్రతిపక్ష టీడీపీకి సానుకూలత కనిపించలేదు. పోలింగ్ కేంద్రాలకు గతంలో కంటే భిన్నంగా ఉదయం నుంచి ఓటర్లు పోటెత్తడం వంటి పరిణామాలు చూసిన విశ్లేషకులు ఇది కచ్చితంగా ప్రభుత్వానికి పడిన ఓట్లుగానే చెబుతున్నారు. ప్రధానంగా మొదటి నుంచి టీడీపీకి మెజార్టీ వచ్చే బూత్‌ల్లో కూడా ఈ దఫా ఫ్యాన్ గాలి వీచిందనే ప్రచారం జరుగుతోంది. తొలి నుంచి ప్రతిపక్ష టీడీపీ కూటమి పేరుతో ఎన్ని కుయుక్తులు పన్నినా.. వైఎస్సార్‌సీపీలోని వారికి ప్యాకేజీలు ఇచ్చి లోబరుచుకున్నా పోలింగ్ ప్రక్రియలో వారు ఆశించిన స్థాయిలో ఓట్లు పడలేదని క్యాడర్ తీవ్ర నైరాశ్యంలో పడిపోయింది. 2019లో 83.38 శాతం ఓట్లు పోల్ కాగా 2024లో 83.49 శాతం పోలింగ్ జరిగింది. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు జగన్ ప్రభుత్వానికే తమ మద్దతు తెలిపారు. ముఖ్యంగా ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున ఉదయం 6.30 గంటల నుంచే ఓటు పోల్ చేసేందుకు క్యూలైన్లలో వేచి ఉండి ఓటు వేశారు. డయాలసిస్ రోగులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఓటర్లు సైతం జగనన్న పథకాల లబ్ధిదారులు కావడంతో తమ కృతజ్ఞతలు ఓటు ద్వారా తెలిపేందుకే వీల్‌చైర్లు, పలువురు సహాయకులతో కలిసి ఓటు వేసేందుకు వచ్చారంటే పరిస్థితి ప్రభుత్వానికే ఎంత అనుకూలంగా ఉందో అర్థమవుతోంది. దీనికి తోడు అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో లబ్ధిపొందిన తల్లులు, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి పథకాలు మరే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కొనసాగవని తిరిగి తమకు తిప్పలు తప్పవని ఆలోచన చేసి జగనన్న ప్రభుత్వానికే తమ మద్దతును బహిరంగంగా ప్రకటించారంటే వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు దీటుగా పట్టణ ప్రాంతంలోనూ మహిళలు అధిక సంఖ్యలో ఓటు పోల్ చేసేందుకు రావడం, కేవలం మహిళా పక్షపాత ప్రభుత్వమైన వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపేందుకే వారు ఓటు పోల్ చేసేందుకు వచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఓటింగ్ శాతం సైతం పెరిగింది. తమకు బలం లేదని తెలిసి పలు ప్రాంతాల్లో ఓట్లు కొనేందుకు టీడీపీ నాయకులు డబ్బులు వెదజల్లి కొన్ని ఓట్లు అయినా చీల్చేందుకు చేసిన ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసేందుకే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరో సారి అధికారంలోకి తెచ్చేందుకే సిద్ధపడి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని స్పష్టమవుతోంది.



పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధుడు (ఫైల్)

పనిచేయని ప్యాకేజీలు

ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ నేతలను, ప్రజాప్రతినిధులను టీడీపీ సంతలో పశువుల్లా కొనేసింది. అయితే వీరి ద్వారా కనీసం వారి స్వస్థలాల్లో కూడా ఓట్లు పడలేదని, అక్కడే వైఎస్సార్‌సీపీకి మరింతగా ఓట్లు పెరిగాయని సంకేతాలు ఉన్నాయి. వీరికి రూ.లక్షల్లో ప్యాకేజీలు ఇచ్చినా.. ఫలితం లేకుండా పోయిందని టీడీపీ కేడర్ రోదిస్తుందంట.

మేకపాటి ఇంట సందడి

మర్రిపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి ఇంట బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సందడి వాతావరణం నెలకొంది. జరిగిన ఎన్నికల్లో మంచి విజయం సాధిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో 84 శాతం పోలింగ్ నమోదు కాగా 2019 ఎన్నికల్లో 81 శాతం నమోదైంది. గతంలో కంటే ఈ ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని 3 శాతం ఓటింగ్‌లో అధికంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సారి జరిగిన ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సంక్షేమ పథకాల అభివృద్ధి ధ్యేయంగా ఐదు సంవత్సరాలు అందించిన పాలనను మళ్లీ కోరుకుంటున్నారని, రాబోయే ఐదేళ్లు కూడా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలబడాలని, ఈ ఎన్నికల్లో మహిళలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. పెరిగిన మూడు శాతం ఓట్లు కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాపాలన, సంక్షేమానికే పట్టం కట్టారన్నారు. పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో తమ గెలుపు ఎవరూ ఆపలేరని, మంచి మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత అందేలా కృషి చేస్తానన్నారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా మొత్తం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొని ప్రజాపరిపాలనకు పట్టం కట్టారన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంచి మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు మండల వైఎస్సార్సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, పలువురు సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

పోలీసుల బరితెగింపు

- టీడీపీకి అనుకూలంగా పని చేసిన అధికారులు
- హత్యాయత్నం కేసును నమోదు చేయని పోలీసులు
- కేసు తీవ్రతను నీరుగార్చేయత్నం

కావలి: ఎన్నికల వేళ.. స్వతంత్ర ప్రతిపత్తి నెపంతో కావలి నియోజకవర్గంలో కొందరు పోలీసు అధికారులు బరితెగించారు. టీడీపీ ఇచ్చిన భారీ ముడుపులను తీసుకున్న పోలీసు అధికారులు.. ఆ పార్టీ నేతలకు కొమ్ముకాస్తూ అడ్డంగా పనిచేశారు. టీడీపీ రౌడీ మూకల హత్యాయత్నంలో ప్రాణాలతో బయట పడిన వ్యక్తి అందజేసిన ఫిర్యాదును కనీసం కేసుగా కూడా నమోదు చేయకుండా నీరుగార్చారు. బాధితులపైనే కేసు నమోదు చేసి తమ పోలీస్ బుద్ధిని చాటుకున్నారు. దగదర్తి మండలం తడకలూరులో చిరంజీవి అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త పోలింగ్ బూత్ వద్ద గ్రామ టీడీపీ రౌడీమూకలు, జలదంకి శ్రీహరినాయుడు, అతని తమ్ముడు మనోహర్ నాయుడుతో పాటు వారి గ్యాంగ్ చేస్తున్న ఆకృత్యాలను అడ్డుకున్నాడు. దీంతో చిరంజీవిపై కక్ష పెట్టుకున్న జలదంకి శ్రీహరినాయుడు, మనోహర్‌నాయుడు పోలింగ్ అయిన మరుసటి రోజు మంగళవారం మారణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడిని నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యులు తలకు 9 కుట్లు వేసి, కంటికి అయిన తీవ్ర గాయాలకు చికిత్స చేశారు. మెరుగైన వైద్య కోసం మరిన్ని పరీక్షలు చేయాలని వైద్యులు చెప్పడంతో చిరంజీవి ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినా బుధవారం అర్ధరాత్రి వరకు కూడా బాధితుడి ఫిర్యాదును కనీసం కేసుగా కూడా దగదర్తి పోలీసులు నమోదు చేయలేదు. ఈ విషయంపై బాధితుడైన చిరంజీవి కుటుంబ సభ్యులు దగదర్తి పోలీసులను కలవగా, చిరంజీవిపై కూడా టీడీపీ నాయకులు ఫిర్యాదు అందజేసి ఉన్నారని, వారు కూడా గాయాలతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేసుకున్నట్లు చెప్పారని టీడీపీకి వకల్తా పుచ్చుకుని మాట్లాడుతుండటంతో బాధితుడి కుటుంబ సభ్యులు నివ్వెరపోయారు. బాధితుడిపై దాడి చేసిన శ్రీహరినాయుడు వెంకటగిరి నియోజకవర్గంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తుండడం గమనార్హం. దగదర్తి ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీలు టీడీపీ నుంచి భారీగా ముడుపులు తీసుకొని హత్యాయత్నం కేసును నీరుగార్చేలా ఇప్పటి వరకు కనీసం ఫిర్యాదును కేసుగా కూడా నమోదు చేయలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన

ఆత్మకూరు: ప్రజల ఆరోగ్యమే పరమావధిగా జరుగుతున్న జగనన్న సురక్ష పథకంలో భాగంగా పట్టణంలోని సీహెచ్‌సీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 110 మందికిపైగా రోగులు వైద్య సేవలు పొందారు. డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుగర్ బీపీ, తదితర వ్యాధులకు చికిత్సలు అందించారు. డాక్టర్ అస్మా మాట్లాడుతూ గతంలో వైద్య సేవలు పొందిన వారికి ఫోన్ ద్వారా సమాచారం పంపామని, మందులు కావాల్సిన వారికి ఉచితంగా అందజేసినట్లు ఆమె తెలిపారు. కొత్తగా వైద్యసేవలు అందిన వారికి ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేలా ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేస్తుననట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



ఆత్మకూరు సీహెచ్‌సీ కేంద్రంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అస్మా

కోస్తా రాస్తాలో.. రయ్‌రయ్..

నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు తీరంలో ప్రతిష్టాత్మకంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నంపోర్టులు తుది దశలో రూపుదిద్దుకుంటున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లకు అనుసంధానంగా తీరం వెంబడి రహదారి నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం ఈ మార్గంలో వాహనాల రాకపోకలు రయ్‌రయ్ మంటూ పరుగులు తీస్తున్నాయి. వాణిజ్య పరంగా రవాణా, ఎగుమతులకు ఈ రహదారి అనుకూలమవుతోంది.

- ఫిషింగ్ హార్బర్, పోర్టుకు అనుసంధానం
- తీరం వెంబడి జువ్వలదిన్నె– రామాయపట్నం మధ్య రోడ్డు
- రూ.9.42 కోట్లతో 23 కి.మీ. బీటీ రోడ్డు నిర్మాణం



రూపుదిద్దుకున్న రోడ్డు

కావలి: కావలి నియోజకవర్గంలోని బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు ఆనుకుని ఉన్న కావలి మండలం అన్నగారిపాళెం పంచాయతీ లక్ష్మీపురం నుంచి జిల్లా సరిహద్దులో ప్రకాశం జిల్లా రామాయపట్నం సముద్ర తీర గ్రామం సరిహద్దు వరకు రూ.9.42 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. వాణిజ్య, రవాణా, ఎగుమతులు తదితర రంగాల్లో విశిష్టతగా ఉపయోగపడేందుకు లక్ష్మీపురం నుంచి తుమ్మలపెంట మీదుగా పెద్ద పట్టపుపాళెం పంచాయతీ నందెమ్మపురం వరకు 23 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి మత్స్య సంపదను మార్కెట్‌కు తరలించడానికి, జాతీయ రహదారికి అనుసంధానం చేయడం, మత్స్యకార గ్రామాల ప్రజలు తీరం వెంబడే తమ గ్రామాలకు రాకపోకలకు అనుకూలంగా మారింది. ఈ ఏడాది నిర్మాణ పనులు ప్రారంభం కానున్న 'దామవరం విమానాశ్రయం- దాదాపు తొలి దశ పూర్తయిన రామాయపట్నం పోర్టు- ఫిషింగ్ హార్బర్ కనెక్టివిటీ చేస్తూ విశాలమైన రోడ్డు మార్గం ఆవశ్యకతను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దూరదృష్టితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్‌లో ఈ రోడ్డు ప్రాధాన్యతను గుర్తించిన ముఖ్యమంత్రి వెంటనే నిధులు మంజూరు చేయడం, బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేశారు. సముద్రం తీరం వెంబడి ఉండే బకింగ్‌హామ్ కెనాల్‌ను ఆనుకొని ఈ రహదారి నిర్మాణాన్ని డిజైన్ చేశారు.

బీచ్ రోడ్డుకు అనుసంధానంగా..

కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టు- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ రోడ్డు కావలి మండలంలోని తుమ్మలపెంట సముద్ర తీరానికి వెళ్లే బీచ్ రోడ్డుకు అనుసంధానం అవుతుంది. తుమ్మలపెంట వద్ద జంక్షన్ కానుంది. దీంతో రానున్న రోజుల్లో బీచ్ రోడ్డులో వాహనాల రద్దీతో పాటు, ప్రజల రాకపోకల ఒత్తిడి భారీగా పెరగనున్నది. ఈ నేపథ్యంలో కావలి పట్టణం నుంచి బీచ్ రోడ్డును మున్సిపాలిటీ పరిధి వరకు డబుల్ రోడ్డుగా విస్తరణ చేసి సిమెంట్ రోడ్డును నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అక్కడ నుంచి డబుల్ రోడ్డుగా తుమ్మలపెంట జంక్షన్ వరకు విస్తరణతో కూడిన తారు రోడ్డు నిర్మాణం చేయడానికి చర్యలు తీసుకున్నారు. పట్టణం నుంచి చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి ఉన్న అండర్ పాస్ వరకు సిమెంట్ రోడ్డుగా డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో పాటు డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్‌ను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఓటర్లు ఆదరించారు



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో ఆదరించారని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. పోలింగ్ ముగిసిన సందర్భంగా ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో 76.80 శాతం పోలింగ్ జరిగిందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు ఉదయం ఆరు గంటల నుంచే వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు కష్టపడి పని చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు ప్రత్యేకంగా ఆమె అభినందనలు తెలియజేశారు. ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీపై ప్రతిపక్షాలు ఎన్ని అభాండాలు వేసినా ప్రజలు నమ్మలేదని, పోలింగ్ రోజు ఓటింగ్ సరళిని చూస్తే ప్రజలను జగనన్నపై నమ్మకం, విశ్వాసం మరింత పెరిగిందన్నారు. ఏది ఏమైనా సీతారామపురం మండలంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ తథ్యమన్నారు.